www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 3 జనవరి 2026
5
పశ్చిమ గోదావరి



విద్యార్థులకు కెరియర్ గైడెన్స్

పాలకోడేరు : వేండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత స్వచ్ఛంద సాంఘిక సేవా సంస్థ భీమవరం, తణుకు శాఖల ఆధ్వర్యాన పదవ తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన శుక్రవారం కల్పించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం జివిబి.శ్రీనివాసు అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యా సేవా యజ్ఞంలో భాగంగా మార్చిలో జరగబోయే 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు నిపుణుల నుండి కొన్ని విషయాలను సేకరించి అందిస్తున్నామన్నారు. విద్యార్థులు సలహాలను, సూచనలను పాటించి మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలన్నారు. మానవత సంస్థ కన్వీనర్ కోడూరి రాధా పుష్పవతి మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి తరువాత తమ భవిష్యత్తును వారి అభివృద్ధికి, సామర్ధ్యానికి, వ్యక్తిత్వానికి తగిన కోర్సులను ఎన్నుకోవాలన్నారు. చైర్మన్ కె.శారద దేవి విద్యార్థులు తాము ఎంపిక చేసుకునే కోర్సుల గురించి వివరించారు. పంపనసాయి బాబు, జి.శుభోసుబాబు, జోగి శ్రీనివాసరావు, ఎ.వెంకటరమణ, వివి.శ్రీధర్, ఎస్.నాగబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పంచాయతీ' జరిగేనా..!

ఎన్నికలపై గ్రామాల్లో తీవ్ర చర్చ
ఏప్రిల్ రెండో తేదీతో సర్పంచుల పదవీ కాలం పూర్తి
జనవరిలో ఎన్నికలంటూ మూడు నెలల క్రితం హడావుడీ
ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమీషన్
మళ్లీ మౌనం వహించిన ప్రభుత్వం, గ్రామాల్లో ఎన్నికల హైటెన్షన్
ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 409 పంచాయతీలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో హైటెన్షన్ నెలకొంది. ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుందా.. లేక ప్రత్యేక అధికారుల పాలనకు దిగుతుందా అన్న చర్చ గ్రామాల్లో విస్తృతంగా సాగుతోంది. గత ఏడాది సెప్టెంబర్‌లో జనవరి నెలలో పంచాయతీ ఎన్నికలంటూ ప్రభుత్వం నర్మగర్భంగా పేర్కొంది. ఎన్నికల కమీషన్ ఫ్రీ ఎన్నికల షెడ్యూల్ సైతం విడుదల చేసింది. దీంతో ఇక పంచాయతీ ఎన్నికలు షూరూ అంటూ పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. తర్వాత ప్రభుత్వం మౌనం వహించడంతోపాటు, పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ప్రకటనలు లేకపోవడంతో ఏం జరుగుతుందన్న ప్రశ్న గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. పంచాయతీ సర్పంచులుగా పోటీలోకి దిగాలని ఆశిస్తున్న అభ్యర్థుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు ఉన్నాయి. 2021 ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ రెండో తేదీ నుంచి పంచాయతీల పాలన మొదలైంది. 2026 ఏప్రిల్ రెండో తేదీతో పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగియనుంది. దీంతో ప్రభుత్వం సకాలంలో ఎన్నికలు జరుపుతుందా అన్న అనుమానాలు సర్వత్రా నెలకొన్నాయి. జనవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు, ఈలోగా అందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తిచేయాలంటూ సెప్టెంబర్ మూడో తేదీన ఎన్నికల కమీషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్ సైతం విడుదల చేసింది. అక్టోబర్ 16వ తేదీలోగా డీలిమిటేషన్ ప్రక్రియ, రిజర్వేషన్లు, ఖరారు చేయాలని, అక్టోబర్ 16వ తేదీ నుంచి నవంబర్ 15వ తేదీ లోపు వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, నవంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు రిటర్నింగ్ అధికారులను నియమించుకోవాలని, నవంబర్ 16 నుంచి పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకుని తుది జాబితా సిద్ధం చేసి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. 2026 జనవరిలో పంచాయతీ ఎన్నికలంటూ ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్‌లో ఎన్నికల కమీషన్ పేర్కొంది. జనవరి నెల వచ్చేసింది. ఇప్పటి వరకూ ఎన్నికల కమీషన్ చెప్పిన ఏ ఒక్క ప్రక్రియా పూర్తికాలేదు. పంచాయతీ ఎన్నికలపై ఒక్క అడుగు ముందుకు పడిన దాఖలాలు లేకుండా పోయాయి.

ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ..

పంచాయతీ ఎన్నికలను ప్రభుత్వం సకాలంలో నిర్వహిసుందన్న ఆశతో సర్పంచిగా పోటీ చేయాలనుకున్న ఆశావహులంతా జనాల్లో తిరుగుతున్నారు. ఎంఎల్ఎలు, స్థానిక నేతల వద్ద తమ మనసులోని కోరిక చెప్పి ముందుకు సాగుతున్నారు. పలు చోట్ల టిడిపి, జనసేనకు చెందిన నేతల మధ్య పదవీ పోటీ సైతం నెలకొంది. గత రిజర్వేషన్ల ఆధారంగా లెక్కలు వేసుకుని అభ్యర్థుల ఎంపికపై ఇప్పటికే వైసిపి, టిడిపి, జనసేన నేతలు కసరత్తు చేశారు. ఆర్థిక, అంగబలం ఉన్నవారికి అవకాశాలు ఇచ్చేందుకు నిర్ణయానికి సైతం వచ్చారు. పార్టీలన్నీ సర్పంచి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల విషయంలో ఒక స్పష్టతకు వచ్చాయి. అధికార పార్టీకి చెందిన కూటమి నుంచి పోటీ చేసే అభ్యర్థులు గ్రామాల్లో ఇప్పటికే జనాల్లో తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు సైతం జనాలతో మమేకం అవుతున్నారు. పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించాలంటే రిజర్వేషన్లు, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు వంటి ప్రక్రియలు పూర్తిచేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా కొత్త పంచాయతీల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో చాలా పంచాయతీలకు సంబంధించి వినతులు వచ్చాయి. పంచాయతీల విభజన ప్రక్రియను నిలుపుదల చేస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం మళ్లీ ఆదేశాలు ఇచ్చింది. సకాలంలో పంచాయతీ ఎన్నికలు జరగాలంటే ప్రభుత్వం అందుకు సంబంధించిన ప్రక్రియకు పూర్తికి అధికారులకు ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన స్పందన లేకుండా పోయింది. కూటమి సర్కార్ పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహిస్తుందో లేదో చూడాల్సి ఉంది.

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి
రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ


పెదఅమిరంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్, కలెక్టర్

ప్రజాశక్తి - కాళ్ల

గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రీసర్వేలో అవకతవకలు జరిగాయని, నేడు వాటన్నింటినీ పరిష్కారం చేసేందుకు భూ సర్వే పెట్టడం జరుగుతుందని, దానికి రైతులందరూ సహకరించాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పెదఅమిరంలో రెవెన్యూ గ్రామ సభలో కొత్త పట్టాదారు పాస్ బుక్‌లో పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ గతంలో జగన్ ఫోటోతో ఉన్న పుస్తకాల్లోని తప్పులను సవరించి, ఇప్పుడు కేవలం ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో అత్యంత పారదర్శకంగా వీటిని రూపొందించాన్నారు. ఈ సర్వేలో ఇప్పటివరకు భూమి తగ్గిన వారు మాత్రమే తిరుగుతున్నారని భూమి పెరిగిన వారు ఎవరూ తిరిగి రావడం లేదని, అటువంటి వారికి ఒకటి, రెండు నోటీసులు ఇచ్చి పెరిగిన భూమిని తగ్గిన వాళ్లకి చేర్చనున్నామని తెలిపారు. నూతన నాణ్యతా ప్రమాణాలతో తయారైన ఈ పాస్‌బుక్‌లను అన్ని గ్రామాల్లోనూ రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ గతంలో జరిగిన సర్వేపై ప్రభుత్వం కొన్ని సూచనలు ఇచ్చిందని, ఆ సూచనలు పాటిస్తూ వాటికి అనుగుణంగా సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 110 గ్రామాల్లో 59 వేల పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇచ్చామని తెలిపారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ క్లినిక్‌లు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ఆరేటి వెంకటరత్న ప్రసాద్, కోరా రామమూర్తి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేయాలి

18 అడుగుల ఎర్రజెండాతో సిఐటియు నేతల ర్యాలీ, కరపత్రాల పంపిణీ


వీరవాసరంలో 18 అడుగుల జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

ప్రజాశక్తి - వీరవాసరం

విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం కావాలని కోరుతూ వీరవాసరంలో 18 అడుగుల ఎర్రజెండాను శుక్రవారం ఊరేగించారు. ఈ సందర్భంగా మహాసభలు జయప్రదం కావాలని, కార్మిక కర్షక ఐక్యత వర్ధిల్లాలని, ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జుత్తిగ నరసింహామూర్తి మాట్లాడుతూ సిఐటియు ప్రజా పోరాటాల వారధి అని, కార్మిక కర్షక ఉద్యోగుల సమస్యలపై మహాసభలో చర్చ జరుగుతుందని అన్నారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని పలు తీర్మానాలను మహాసభలో ఆమోదించారని తెలిపారు. భవిష్యత్తులో సిఐటియు చేసే పోరాటాల్లో దేశంలోని అన్ని తరగతుల ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాలుగో తేదీన విశాఖపట్నంలో జరుగుతున్న బహిరంగ సభకు మండలం నుంచి కూడా పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర అలమహారాజు, బాలం విజయకుమార్, రాము, నారాయణమూర్తి, శ్యామ్ పాల్గొన్నారు.

తణుకు : కార్మిక, కర్షకుల అభివృద్ధి కాకుండా దేశం ముందుకు పోదని పాలకులు తెలుసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. శుక్రవారం పట్టణంలో హలో కార్మిక-ఛలో విశాఖ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈనెల 4న జరిగే బహిరంగ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్స్‌కి వేతనాలు పెంచాలని, పిఎఫ్ పెన్షన్ 9 వేలు ఇవ్వాలని, భవన నిర్మాణ బోర్డు పునరుద్ధరించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని పెద్దత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, మండల కన్వీనర్ గుబ్బల గోపిలు మాట్లాడుతూ.. నేడు దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. అన్ని తరగతుల ప్రజల సమస్యలు చర్చించడానికే చట్ట సభలు ఉన్నాయని పాలకులు మరచిపోయారని ఎద్దేవా చేశారు. చట్ట సభల్లో అధికార, ప్రతి పక్షాలు గొడవలు పడడం తప్ప ప్రజా సమస్యలు చర్చించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు మనం అనుభవిస్తున్నవన్నీ పోరాటాల ద్వారా వచ్చాయన్నారు. చట్ట సభల్లో కార్పొరేట్లకు ఉన్న రుణాలు రద్దుచేయడం, భూములు దారదత్తం చేయడానికి బిజెపి ఉపయోగిస్తుందని విమర్శించారు. పాలకుల విధానాలు ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. తగిన సమయంలో గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చుక్క సూరిబాబు, ఎం.రాజు, ఎం.సురేష్, పి.శివ, కె.శేఖర్, ఎం.కొండయ్య, వి.వెంకట రావు, డి.రాము, కె.నాగబాబు, వాసుబాబు పాల్గొన్నారు.

ఆకివీడు : కేంద్ర ప్రభుత్వం వాణిజ్య గ్యాస్ ధరలు పెంచడం, విమాన ఇంధన రేట్లు తగ్గించడం వంటి చర్యలు మధ్యతరగతికి విఘాతం కలిగిస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నాయని, ఈ రకమైన విధానం ఎంత మాత్రం తగదని సిఐటియు మండల కో కన్వీనర్ కె.తవిటి నాయుడు విమర్శించారు. ఈ రకమైన విధానం సామాన్యులకు ఆందోళన కలిగిస్తుందన్నారు. సిఐటియు అదిలాబాద్ మహాసభ సందర్భంగా శుక్రవారం సాయంకాలం స్థానిక వేలంపేట రామాలయం వద్ద విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను బజారు ముఠా కార్మికులు, నాయకులు, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తవిటి నాయుడు మాట్లాడారు. ఈనెల నాలుగవ తేదీన జరిగే బహిరంగ సభ ప్రదర్శనలకు ఉద్యోగులు, కార్మికులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వి.అప్పారావు, ఎస్.సూరిబాబు, నిమ్మల శీను, ఎస్.శ్రీనివాసరాజు, నక్క రమేష్ పాల్గొన్నారు.


ఆకివీడులో..



తణుకులో..

కోడి పందేలు నిరోధించేందుకు చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సంక్రాంతి పండుగ ముసుగులో జంతువులను హింసిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. సంక్రాంతి కోడిపందేలను నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో శుక్రవారం జిల్లా జంతు సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ నాగరాణి అధ్యక్షత వహించారు. కోడిపందేలు నియంత్రణ, జంతు సంక్షేమం, మానవ జంతు సంబంధాలు, జంతు సంక్షేమ నియమాలు, జంతు సంక్షేమ చట్టాలు, జంతువుల రవాణా నియమాలు వంటి అంశాలపై చర్చించారు. భీమవరం అంటే కోడి పందేలు అనే విపరీత ప్రచారం ఉందని, రాష్ట్రం నలుమూలల నుంచి కోడి పందేలు, పేకాట, గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌లకు వస్తారని వీటిని పూర్తిగా నిరోధించాలని తెలిపారు. భీమవరంలో వినోదాన్ని అందించే సాహసోపేత క్రీడలను ప్రోత్సహించాలన్నారు. కోడి పందేలను గ్రామాల్లో ప్రోత్సాహానికి పోలీసులు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని హెచ్చరించారు. కోడికి కట్టే కత్తుల సరఫరా మీద నిఘా పెట్టి, గుండాట, పేకాట ఇలాంటి కార్యక్రమాలు జరుగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చట్ట వ్యతిరేక వినోదానికి ఎపి గేమింగ్ యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కోడి పందేల నిర్వహణపై పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించడం జరుగుతుందని ఇటువంటి వాటిని ముందుగానే నిరోధించాలని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ శాఖలను ఆదేశించారు. పోలీస్ శాఖ డ్రోన్లను వినియోగించి చర్యలను కట్టుదిట్టం చేయాలని సూచించారు. డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆర్.కోటిలింగరాజు, సహాయ సంచాలకులు జి.సత్యనారాయణ, భీమవరం డిఎస్‌పి రఘువీర్ విష్ణు, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కతీబ్ కౌసర్ భానో, జిల్లా రవాణా శాఖ అధికారి ఎంవి కృష్ణారావు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, జీవన ఎరువుల వాడకాన్ని పెంచి భూమాతను కాపాడుకుందామని తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు తెలిపారు. ఎరువులు, పురుగుమందుల చట్టాలపై డీలర్లకు అవగాహన కల్పిస్తూ డివిజన్ స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పురుగు మందులకు సంబంధించిన ఇన్సెక్టిసైడ్స్ యాక్ట్ 1968 గురించి, ఎరువులకు సంబంధించి ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 చట్టం గురించి ఎడిఎ గంగాధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీలర్లకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ఎరువులు, పురుగుమందులు, చట్టాలపై అవగాహన కల్పించుకోవడం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించగలుగుతారన్నారు. ఎరువులు, పురుగు మందులు విక్రయంలో డీలర్లు నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. రసాయనక ఎరువులు, యూరియా వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వాడకం వైపు రైతులను ప్రోత్సహించాల్సిన బాధ్యత డీలర్లపై కూడా ఉందన్నారు. ప్రజలకు ఆరోగ్యకరమైన పోషక విలువలతో కూడిన ఉత్పత్తులను అందించగలుగుతామన్నారు. భూమాతను కాపాడుకోవడం ద్వారా సుస్థిరమైన వ్యవసాయానికి దోహదపడుతుందన్నారు. ఇక నుంచి ఎరువులు, పురుగుమందుల డీలర్లకు లైసెన్సులు మంజూరు నుంచి నిల్వలు, విక్రయాలు తదితర వివరాలన్నింటినీ వెబ్సైట్లో నమోదు చేయాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. డీలర్లు కూడా దీనికి సహకరించి భూమాతను కాపాడేందుకు, ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తికి, సుస్థిరమైన వ్యవసాయానికి, రైతులు ఆర్థిక అభివ ద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఏడీఏ గంగాధర్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ సందరరేగా డీలర్లు సందేహాలను నివ త్తి చేస్తూ వారు అడిగిన పలు ప్రశ్నలకు ఏడిఏ గంగాధర్ సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాల వ్యవసాయ అధికారులు వి. నారాయణరావు, చీర్ల రవికుమార్, ఆర్ఎస్.ప్రసాదరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సొసైటీల కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారిక లాంచనాలతో జవాన్‌కు అంత్యక్రియలు


సత్యనారాయణ అంతిమ యాత్ర


జవాన్ సత్యనారాయణ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని బొండాడపేట గ్రామానికి చెందిన పారా మిలటరీ జవాన్ బొర్రా సత్యనారాయణ (26) రైలు ప్రమాదంలో మరణించారు. బొర్రా సత్యనారాయణ ఇటీవల సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకుని 15 రోజుల క్రితం బెటాలియన్ రాపిడ్ ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి ఢిల్లీ నుంచి మధుర వద్ద జరిగిన రైలు ప్రమాదంలో సత్యనారాయణ మృతి చెందారు. సత్యనారాయణ పార్థివ దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శుక్రవారం సిఆర్‌పిఎఫ్ డిప్యూటీ కమాండర్ ప్రత్యేక విమానంలో రాజమండ్రి తరలించారు. అక్కడ నుంచి స్వగ్రామమైన బొండాడ తీసుకొచ్చారు. యువ జవాన్ అకాల మరణంతో అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్వగ్రామమైన బొండాడ పేటకు చేరుకున్న సత్యనారాయణ పార్థివ దేహానికి అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు పూర్తిచేశారు. అంతిమయాత్రలో సిఆర్‌పిఎఫ్ బృందం, పోలీస్ శాఖ, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కౌలు రైతు సంఘం కృషి అభినందనీయం : కలెక్టర్

భీమవరం : వ్యవసాయంలో రైతుల సమస్యలు పరిష్కారానికి కౌలు రైతుల సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం 2026 జిల్లా క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ నాగరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయంలో కౌలురైతులు ఎంతో ముఖ్యపాత్ర వహిస్తున్నారన్నారు. అనేక రకాలుగా కష్టపడుతూ పంటలు పండిస్తున్న కౌలురైతుల రక్షణ కోసం కౌలురైతుల సంఘం కృషి చేయడం ఎంతో అభినందనీయమన్నారు. కౌలురైతులకు ప్రభుత్వం అండగా వుంటుందని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉందుర్తి శ్రీనివాసు, మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ సంఘం జిల్లా క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. సంఘం జిల్లా కమిటీ సభ్యులు కవురు శ్రీనివాస్, పిల్లి కామేశ్వరరావు, కూసంపూడి సుబ్బరాజు, దోమ చంద్రపౌలు పాల్గొన్నారు.

పెదఅమిరంలో బస్ షెల్టర్ ప్రారంభం


బస్ షెల్టర్ ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజల అవసరాల కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరం గ్రామంలో మిత్ర మెడికేర్ హాస్పిటల్ ఎదురుగా నిర్మించిన బస్సు షెల్టర్‌ను ఆయన శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం రూ.5 లక్షలు దాతల సహకారంతో నిర్మించారు. ఉండి నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లలో, బస్సు షెల్టర్‌ల వద్ద రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చుండూరు సాయిబాబా, డాక్టర్ చుండూరు మల్లేశ్వరి, డాక్టర్ చుండూరు విక్రాంత్, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

అభివృద్ధిలో జిల్లా ముందంజ

ప్రభుత్వ పథకాల అమల్లో ప్రత్యేక స్థానం
67 వేల మంది రైతుల నుంచి 4.33 టన్నులు ధాన్యం సేకరణ రూ. 987 కోట్లు రైతులకు ఖాతా జమ
జిల్లాకు కోకోనట్ క్లస్టర్ మంజూరు
కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా అభివృద్ధిలో ముందంజలో ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రభుత్వ పథకాలు అమల్లో ప్రత్యేక స్థానం సాధించుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐవిఆర్ఎస్ కాల్స్ అభిప్రాయ శాఖలో రాష్ట్రంలోనే జిల్లాకు మొదటి స్థానం లభించిందని పేర్కొన్నారు. కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డితో కలిసి జిల్లా పురోభివృద్ధి, ఆర్థిక ప్రగతిని కలెక్టర్ నాగరాణి విలేకరులకు వివరించారు. 2025 - 26లో జిల్లాలోని అన్ని శాఖలు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించడం ద్వారా మంచి ప్రగతి నమోదైందన్నారు. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్య సాధనకు కష్టపడి పని చేశారన్నారు. జిల్లా వ్యవసాయ ఆధారితమైందని, ఖరీఫ్ సీజన్లో రైతుల నుంచి 4.33 లక్షల టన్నుల ధాన్యాన్ని 67 వేల మంది రైతుల నుండి సేకరించి రూ. 987 కోట్ల 24 గంటల్లోగా రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. యూరియా కొరత లేదని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. 100 నిరుపేద మత్స్యకారులకు నూరు శాతం సబ్సిడీతో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో పిఎం లంకలో బోట్ల నిర్మాణం జరుగుతోందని ఎంపిక చేసిన మత్స్యకారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. సిద్ధాపురం, కొలమూరు, గొల్లలకోడేరు, పాలకోడేరు, పెనుమదం, పోడూరు గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా 60 మెట్రిక్ టన్నుల ఎరువును ఉత్పత్తి చేసేలా ఆరు గుర్రపు డెక్క ఎరువుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. తాడేపల్లిగూడెంలో కోకో ఫామ్స్ ఉన్నాయని అక్కడ కోకో ఉత్పత్తుల ద్వారా మహిళా సంఘాల వారు చాక్లెట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తున్నారన్నారు. ఉండి మండలం మహాదేవపట్నం, తాడేపల్లిగూడెంలో చాక్లెట్ ఫ్యాక్టరీలు పెట్టడం జరిగిందన్నారు.

ఐవిఆర్ఎస్ అభిప్రాయ సేకరణలో జిల్లాకు ప్రథమ స్థానం


ప్రభుత్వ పథకాలు అమలుపై వివిధ అంశాలకు సంబంధించి ఐవిఆర్ఎస్ ద్వారా సేకరించిన ప్రజాస్పందనలో రెవెన్యూ, ధాన్యం సేకరణ, యూరియా అంశాల్లో ప్రజల సంతృప్తి స్థాయిలో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. మిగిలిన అంశాలలో 2, 3, 4 స్థానాల్లో ఉన్నామన్నారు. జిల్లాలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. జల జీవన్ మిషన్ కింద రూ.335.75 కోట్ల వ్యయంతో 1,488 పనులు మంజూరు కాగా అందులో 914 పనులు పూర్తయ్యాయన్నారు. రూ.1,400 కోట్ల వ్యయంతో చేపట్టిన తీర ప్రాంత మంచినీటి ప్రాజెక్టు ద్వారా 2027 నాటికి 930 నివాసిత ప్రాంతాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పాలకొల్లు ఏరియా ఆసుపత్రిలో 5 పడకల డయాలసిస్ యూనిట్లు ప్రారంభించుకున్నామన్నారు.

ఆర్‌టిసి బస్సు ప్రారంభం


బస్సు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - గణపవరం

మారుమూల గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజల ప్రయాణాలను సలభతరం చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం అర్ధవరం నుండి తాడేపల్లిగూడెం, గణపవరం, భీమవరం వెళ్లడానికి వీలుగా బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ మారుమూల గ్రామాల నుండి ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్ధవరం గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేర్చామని చెప్పారు. గ్రామాలాభివృద్ధిలో రవాణా సౌకర్యం కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ బస్సు సేవలు అర్ధవరం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బిల్డింగ్ వర్కర్స్ నేతలు

సిఐటియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తణుకు

కార్మికులకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బట్ట చిన వీరభద్రరావు, అధ్యక్షులు వాకా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు అనుబంధం) సమావేశం వాకా నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక పార్వతి దేవి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ ముద్రించిన నూతన సంవత్సర కాలమాన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కార్మికులకు శుభాకాంక్షలు తెలిపి క్యాలెండర్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరభద్ర రావు, నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో ఎటువంటి చర్చలు జరపకుండా, ఏకపక్షంగా ప్రకటిస్తే వ్యతిరేకించవలసిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని అమలు చేయడానికి ముందుకు రావడం బాధాకరమన్నారు. ఈనెల 4వ తేదీన జరుగుతున్న భారీ బహిరంగ సభకు కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అల్లాడ నాగ బలరాం, తాళ్ల సత్యనారాయణ, యర్రా మల్లికార్జునరావు, ఆకంచి గంగాధర రావు, సొరపల్లి రామకృష్ణ, మల్లాడి మాధవకృష్ణ, దొంతంశెట్టి ముకుందరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి విల్సన్ బాబు

వెలమపేటలో ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక వెలమపేటలో ఫ్రైడే డ్రైడేపై స్థానికులకు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే చేయాలని సిబ్బందికి చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పి ఎ.సత్యవతి, ఎంపిహెచ్‌ఎస్ సుధ పాప, ఎఎన్ఎం వి.జయమ్మ, సుందర మోహన్, ఆరోగ్య కార్యకర్తలు, 104 సిబ్బంది బి.శ్రీనివాస్, ఎస్.రాము పాల్గొన్నారు.

గ్రామీణ సమస్యల పరిష్కారానికి కృషి

గ్రామ సభలో ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామీణ సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దర్భరేవు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తాగునీటి సమస్య, సాగునీటి సౌకర్యాలు, రోడ్లు, ఇళ్ల స్థలాలు వంటి పలు ప్రజా సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించి దశలవారీగా పరిష్కరిస్తామని నాయకర్ హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని ఆయన సూచించారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పెనుమంట్ర గ్రామంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదిక మీద ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వచ్చిన ప్రజల సమస్యలను నేరుగా ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వివరించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అక్కడ ఉన్న సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ కృషిచేస్తానని పితాని సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం : టిడిపి కార్యాలయంలో శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యాన ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్-ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేదిక ద్వారా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు నుండి ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలపై వినతులు, ఫిర్యాదులు, అర్జీలను స్వీకరించారు. స్వీకరించిన ప్రతి సమస్యను సవివరంగా పరిశీలించి, వాటికి తగిన పరిష్కార దిశగా సంబంధిత అధికారులతో వెంటనే సంప్రదించాలని అధికారి, ప్రతి సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రారంభించడం జరిగిందని రామరాజు తెలిపారు. రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కొల్లు పెద్దిరాజు, నరసాపురం ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మాజీ ఎఎంసి ఛైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ రాగూర్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, సంకు భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

నత్తల మురుగు కాలువలో పూడిక తీయాలి

టిడిపి గ్రీవెన్స్‌లో వినతి

నరసాపురం: నత్తల మురుగు కాలువ పూడిక తీయాలని యర్రంశెట్టి వారి పాలెం మాజీ సర్పంచి కూనపురెడ్డి రంగారావు అన్నారు. శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుకు ఆయన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ రుస్తుంబాద నత్తల మురుగు కాలువ గత 8 సంవత్సరాలుగా పూడిక తీయకపోవడం వల్ల నీరు లాగక, ఆక్రమణలు తొలగించకపోవడం వల్ల దాని పక్కన ఉన్న భూముల ముంపుకు గురై రైతులు రెండు పంటలు నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రుస్తుంబాద మైలాబత్తుల శీను ఇంటి వద్ద నుండి నెంబర్ 3 స్లూయిస్ వరకు లేటు మధ్య కొంత రోడ్డును మూసి రోడ్డుగా మార్చి రైతులు పండించిన పంటను మార్కెట్‌కు తరలించడానికి వెసులుబాటు కల్పించాలని రామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు విజయ రంగారావు తెలిపారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు


కృష్ణవేణమ్మ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ ప్రివిలేజ్డ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాయుడు రామచంద్ర ప్రభు, గుంటూరు సహకారంతో శ్రీకృష్ణవేణమ్మ కాపు తెలగ బలిజ సంక్షేమ సంఘం పాలకొల్లు, కాపు కార్తీక వన సమారాధన కమిటీ ఆధ్వర్యాన ఫిబ్రవరి 8న నియోజకవర్గ పరిధిలో ఉన్న కాపు తెలగ బలిజ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ వితరణ జరుగనుంది. ఇంటర్ లేదా పాలిటెక్నిక్ రెండవ సంవత్సరం, డిగ్రీ, బిటెక్, పీజీ, మెడిసిన్ చదువుతున్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్ పొందటానికి అర్హులు. గత వార్షిక పరీక్షల్లో 75 శాతంపైన మార్కులు పొందిన వారు ఈ ఉపకార వేతనంకు దరఖాస్తు చేసుకోవాలని, అర్హుల ఎంపిక వారి మెరిట్, ఆర్థిక పరిస్థితులను బట్టి ఉంటుందని, ఉండవలసిన అవసరాల కోసం పాలకొల్లు కాపు సంఘం కన్వీనర్ వానా నరసింహారావు(ఫోన్ నెంబర్ : 9912243612) తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు, దరఖాస్తులు ఈ క్రింది వారి నుండి పొందవచ్చున్నారు. వనాకుల సూర్య నరేష్ బాబు, రైల్వే గేట్ వద్ద పాలకొల్లు ఫోన్ నెంబర్ : 9494337711, ముప్పర్తి శ్రీరామ్ గెస్ట్ హౌస్, గాంధీ బొమ్మల సెంటర్, పాలకొల్లు ఫోన్ నెంబర్ : 9494337012 సంప్రదించవచ్చున్నారు.

రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామాల్లోని రైతులకు మా భూమి-మా ధైర్యం అనే థీమ్ కలిగేలా భూమి హక్కుల తెలుపుతూ పట్టాదారు పాస్ పుస్తకాలను కూటమి ప్రభుత్వం ఇస్తుందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని వెలగలేరు గ్రామ పంచాయతీ వద్ద జరిగిన ప్రభుత్వ ముద్రతో ఉన్న భూమి హక్కు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అప్పటి ప్రభుత్వం జగన్ బొమ్మ పెట్టి రైతులకు ఒరిజినల్ పట్టా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతీ గ్రామంలో మూడు సభలు పెట్టి, రైతుల సమస్యలు తెలుసుకొని ఆ ప్రకారం రెవెన్యూ శాఖ సహకారంతో భూమి హక్కు పాస్ బుక్ రూపొందించడం జరిగిందన్నారు. మహిళా శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం వినియోగించుకుంటున్న మహిళలు, పలువురు ప్రయాణికులను గౌరవించి, సహకరించాలని ఆయన కోరారు. వెలగలేరు గ్రామంలో ఉన్న 265 మంది రైతులకు గాను సుమారు 160 మంది రైతులకు పాస్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తమనంపూడి శ్రీనివాస రెడ్డి, వి.బులిరామిరెడ్డి, కర్రి అచ్యుత్ రామా రెడ్డి, తహశీల్దార్ వై.రవికుమార్, రెవెన్యూ సిబ్బంది, కూటమి కార్యకర్తలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

తణుకు : గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏ పథకంలో చూసినా వైఎస్ జగన్మోహన్ రెడ్డి బొమ్మ వేసుకునే వారని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. కేవలం ప్రచార ఆర్భాటం తప్ప అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. శుక్రవారం మండలంలోని కోనాల గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కనీసం సరిహద్దు రాళ్లను సైతం విడిచిపెట్టకుండా జగన్‌మోహన్ రెడ్డి బొమ్మలు వేయించుకునే వారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆత్మగౌరవం నిలబడే విధంగా అధికారికంగా రాజముద్ర వేసి రైతులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పిఎం ఆవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఉజ్వల 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ కనెక్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామదర్శిని కార్యక్రమం ఏర్పాటు చేసి, స్థానికుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కరించే ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పెనుగొండలో..



తణుకులో..



ఆచంటలో..



పెనుమంట్రలో..

ఆచంట : భూమి రికార్డుల వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు రైతుల హక్కులను బలోపేతం చేసే దిశగా పట్టాదారు పాస్ పుస్తకాలు కీలక ఉదుగని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని కందరవల్లి గ్రామంలో సర్పంచి బోడపాటి బుజ్జయ్య అధ్యక్షతన రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఎ పితాని పాల్గొని మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకాలు వల్ల రైతులకు సమయం ఆదా అవ్వడంతో పాటు మధ్యవర్తుల అవసరం తగ్గుతుందన్నారు. కొత్త పట్టాదారు పాసు పుస్తకాలపై రైతుల నుంచి మంచి స్పందన లభిస్తుందని అన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు మాత్రమే ఈ పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుగొండ : ప్రభుత్వం చెప్పింది సర్వే రాళ్లమీద, పాసు పుస్తకాల పైన ఫొటోలు వేసుకునే నీచ సంస్కృతి కూటమి పార్టీలది కాదని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెనుగొండ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచి శ్యామల సోనీ అధ్యక్షతన జరిగిన రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వ నిర్వాకాలను సరిచేసి ప్రతి రైతుకు, ప్రతి గ్రామంలో రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనిత కుమారి, ఎంపిడిఒ సూర్యనారాయణ, వ్యవసాయాధికారి స్పందన, అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని జివిఎస్‌విఆర్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్లో ఆర్.కృష్ణయ్య జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత గుత్తుల నందినిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మద్దాడ గణేష్ మాట్లాడుతూ ఆ రోజుల్లో సమాజంలో మహిళా విద్య పట్ల వ్యతిరేకత ఉన్న కాలంలో తొలి భారతీయ మహిళ ఉపాధ్యాయులుగా ఎదిగిన గొప్ప మహిళ సావిత్రిబాయి పూలే అని ముద్దాడ గణేష్ భవాని అన్నారు. ఈమె జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఈమె గొప్ప సంఘ సంస్కర్త అని, హరిజన విద్యకు కృషి చేసిన జ్యోతిరావు పూలే సతీమణి ఈమె అని చెప్పారు. ఆయన ఆదర్శంగా తీసుకుని మహిళలకు పురుషులతో సమానంగా విద్యా అవకాశాలు కల్పించడానికి కృషి చేశారని, మొట్టమొదటిగా స్త్రీల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేశారని, ఈమె కృషి కేవలం స్త్రీ విద్యకే పరిమితం కాలేదని, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు సేవ చేసిన గొప్ప మహిళ అన్నారు. భయంకరమైన ప్లేగు వ్యాధితో బాధపడుతున్న వారికి సేవ చేస్తూనే మరణించిందని, సావిత్రిబాయి పూలే జీవితం సమాజ సేవలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేసే ఆదర్శమని విద్యార్థులకు వివరించారు. అనంతరం జ్ఞాపికతో పాఠశాలలో పనిచేస్తున్న నందినిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్, పాలకొల్లు పట్టణ మహిళా అధ్యక్షురాలు నాగులకొండ మంగాదేవి, జిల్లా కార్మిక విభాగ అధ్యక్షులు శిడగం రవి శేఖర్, నియోజకవర్గ అధ్యక్షులు పొన్నమండ ముత్యాలరావు, ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, మధుసూదన్ రెడ్డి, లీలాకుమారి పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత నందినిని సత్కరిస్తున్న యాజమాన్యం, విద్యార్థులు

'రీ సర్వేకు రైతులు సహకరించండి'

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఆరేడు గ్రామంలో ప్రారంభమైన రీ సర్వేకు రైతులందరూ సహకరించి అందుబాటులో ఉండాలని ఆరేడు గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆరేడు గ్రామంలో ప్రారంభమైన రీ సర్వేను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లతో అధికారుల వద్దకు వచ్చి సహకరించాలని, రైతులు అందుబాటులో లేకపోతే రీ సర్వేలో సరిహద్దులు తేడాలు వచ్చే అవకాశం ఉందని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడతారని ఆయన సూచించారు. రీ సర్వే పారదర్శకంగా, ఇబ్బందులు లేకుండా జరగాలంటే రైతులందరూ సహకరించి అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

మొగల్తూరు : రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కోల శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే పనులను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రీ సర్వేలో ప్రతి రైతు భూమి కొలతలు దస్త్రాల్లో ఉండాలన్నారు. రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించేందుకు రైతులు సహకరించాలని సూచించారు. ఆయా పనులను మూడు టీములుగా ఏర్పడి సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి మండల సర్వేయర్ బొబ్బిలి శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సామాజిక కార్యక్రమాలు అభినందనీయం

ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతు ప్రయోజనాలకే పరిమితం కాకుండా సామాజిక కార్యక్రమాల్లో కూడా చేపట్టడం అభినందనీయమని ఎంఎల్‌ఎ నాయకర్ అన్నారు. సహకార సంఘం ఆధ్వర్యాన గత నెల 23వ తేదీన ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. శుక్రవారం ఈ శిబిరంలో కంటి చికిత్స చేయించుకున్న అవసరమైన వాళ్లకి కళ్లజోళ్లు కలవకొలను తాతాజీ పాలకవర్గం ఆధ్వర్యాన 185 మందికి ఉచితంగా అందజేశారు. సహకార సంఘం ఆధ్వర్యాన జరిగిన ఉచిత కళ్లజోళ్ల కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన కలవకొలను తాతాజీని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి శ్రీనివాస్, పాలకవర్గం పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో పాలకొల్లు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు



అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల, పాలకొల్లు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ జె.సాయి కుమార్(ఫస్ట్ బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్) మల్లారెడ్డి యూనివర్సిటీ, హైదరాబాద్‌లో డిసెంబర్ 22 నుండి 28, వరకు నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్-2025లో విజయవంతంగా పాల్గొన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరపున శిబిరంలో పాల్గొని కళాశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చిన సాయికుమార్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అభినందించి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్(ఎన్ఐసి)లో భాగంగా జాతీయ ఐక్యతను పెంపొందించడం-వివిధ రాష్ట్రాలు, సంస్కృతులు, భాషల మధ్య స్నేహభావం పెంచడం, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు-వివిధ రాష్ట్రాల నృత్యాలు, పాటలు, సంప్రదాయాల ప్రదర్శన, సామాజిక అవగాహన కార్యక్రమాలు మొదలైనవి అలవర్చుకుంటారని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తెలిపారు. సాయికుమార్‌కు ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బి.వెంకట స్వామి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ విజయలక్ష్మి, ఇతర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పిఎంపిల సేవలు బేష్ : ఎంఎల్‌ఎ ధర్మరాజు


ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల్లో పిఎంపి డాక్టర్లు ప్రజలకి అందిస్తున్న వైద్య సేవలు బేష్‌గా ఉన్నాయని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం పిఎంపి మండల అసోషియేషన్ డాక్టర్లు ధర్మరాజుని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ధర్మరాజు చేతుల మీదుగా జీవనదాన్, అవయవదాన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిఎంపి డాక్టర్లు ఎంతో బాధ్యతగా ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందజేయటం హర్షించ తగ్గ విషయమని అన్నారు. వ్యాధులపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించే విధంగా అసోషియేషన్ కృషిచేయాలని సూచించారు. అసోషియేషన్ మండల అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మూర్తి, జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు, కోశాధికారి కొటకల అప్పారావు, ఇసి సభ్యులు ఎం.మస్తాన్ వల్లి పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

విప్ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ

రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రుస్తుంబాధ మండవారి గరువు, మొగల్తూరు నవుడూరు గరువు, పాలకమ్మ చెరువు 3 కిలోమీటర్లు నాబార్డ్ నిధులు రూ.2.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు నాణ్యత ప్రమాణాలతో రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. రహదారి పనుల్లో ఎలాంటి అలసత్వం వహించవద్దని స్పష్టం చేశారు. అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బందేల భారతి, వైస్ సర్పంచి యడ్లపల్లి కాశీ అన్నపూర్ణ, ఎంపిపి మైలాబత్తుల సోనీ, బందేల రవీంద్ర, గుబ్బల మారాజు, ఆర్‌అండ్‌బి డిఇ కిరణ్ కుమార్, జెఇ కెటీ ప్రసన్న బాబు, నిప్పులేటి తారకరామారావు, పంచాయతీ కార్యదర్శి పి.శేఖర్ బాబు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర కరపత్రం ఆవిష్కరణ

20న అన్న సమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మొగల్తూరు గ్రామ దేవత నడి వీధి ముత్యాలమ్మ జాతర పురస్కరించుకుని ఈనెల 20వ తేదీన మంగళవారం ఉదయం అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జాతర మహోత్సవాలు తెలుపుతూ కరపత్రాన్ని కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడారు. ఈనెల 14వ తేదీన ప్రారంభమై జాతర మహోత్సవాలు 18వ తేదీ ఆదివారం వరకు ఐదు రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామన్నారు. భజన కాలక్షేపం సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జాతర అనంతరం 20వ తేదీన అఖండ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశీయులు గురాజు శ్రీనివాస్, ప్రభాకర్, కలిదిండి కుమార్ బాబు, సంక ముత్య రామ నాగేశ్వరరావు, పాల రాంబాబు, మామిడిశెట్టి సత్యనారాయణ, బోనం నరసింహారావు, జవ్వాది ప్రకాష్, ఉద్దగిరి బుజ్జి, గ్రంధి శ్రీను, పొన్నపల్లి శివ, కడలి చంటి, దేశంశెట్టి శ్రీను, మెండు రాజేష్, పులపర్తి నాయుడు, పలువురు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన

ప్రజాశక్తి - నరసాపురం

నాయకర్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ సతీమణి బొమ్మిడి సునీతా నాయకర్ శుక్రవారం నరసాపురం ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేసి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రోగులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సంకరపు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కొప్పాడ కృష్ణవేణి, సర్పంచి బందెల భారతి రవీంద్ర, రవీంద్ర, నాయకర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి పెమ్మాడి కిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సిఎస్‌ఎన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సీనియర్ నెట్ బాల్ పోటీల్లో భీమవరం డాక్టర్ సిఎస్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లా జట్టు నుండి ప్రాతినిధ్యం వహించి పురుషుల, మహిళల జట్లు కాంస్య పతకాన్ని గెలిచారని కళాశాల ప్రిన్సిపల్ ఎమ్‌డీ సలీం ఖాన్ తెలిపారు. ఈనెల 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం మండలం వెదరేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. మహిళల విభాగంలో టి.ఉమా భవాని(ఎంపిసి ద్వితీయ సంవత్సరం), ఎం.ఎస్తేరు(బైపిసి ప్రథమ సంవత్సరం), కె.రాము(ఎంపిసి ప్రథమ సంవత్సరం), కె.మౌనిక(సిఇసి ప్రథమ సంవత్సరం), పురుషుల విభాగంలో జి.త్రినాధ్(సిఇసి ద్వితీయ సంవత్సరం), ఎన్.విలియం(ఎంపిసి ప్రథమ సంవత్సరం), బాల సాయి రామకృష్ణ(ఎంపిసి ప్రథమ సంవత్సరం) రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకం(3వ స్థానం) గెలిచారని ప్రిన్సిపల్ తెలిపారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరులో జరిగిన 69వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 నెట్ బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఎం.బేబీ రాణి(బైపిసి ద్వితీయ సంవత్సరం), కె.హనోకు(సిఇసి ద్వితీయ సంవత్సరం) మెడల్స్, పుష్పగుచ్ఛంతో అభినందించారు. క్రీడాకారులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, అధ్యక్షులు ముత్యాల వెంకటేశ్వరరావు, ట్రెజరర్ వడుపు గోపి, ప్రిన్సిపల్ ఎమ్‌డీ సలీం ఖాన్, పిడి దావూద్ ఖాన్, సిబ్బంది అభినందించారు.

పాఠశాలకు రూ.15 వేల వితరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

తాము చదువుకున్న పాఠశాలకు సహాయం అందించాలనే ఉద్దేశంతో పదవ తరగతి 1971-72 పూర్వ విద్యార్థులు రూ.15 వేలు పొలమూరు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు డిఎస్.సరస్వతికి శుక్రవారం అందజేశారు. ఈ సొమ్ముతో పాఠశాలకు అవసరమైన విధంగా ఉదయం వేళ జరిగే ప్రతిజ్ఞ సమయంలో వినియోగించుకునేందుకు స్పీకర్, మైకును కొనుగోలు చేయాలని వారు కోరారు. అప్పటి పూర్వ విద్యార్థుల ఎస్‌పిఎల్.కండిబోయిన త్రిమూర్తులు, గొల్లపల్లి స్టీవెన్, మాజీ సర్పంచి చింతపల్లి రామకృష్ణ, స్కూల్‌లోని ప్రస్తుత టీచర్ కోడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

5న పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని వాండ్రం గ్రామంలో ఈనెల 5వ తేదీన మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ ఆధ్వర్యాన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని వాండ్రం గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.చిన్నారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రైతులందరూ అందుబాటులో ఉండి రాజముద్రతో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పాసు పుస్తకాలను అందుకోవాలని తెలియజేశారు.

లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు కృషి

సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మతసామరస్యం, లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు జీవితాంతం కృషిచేసిన గొప్ప కమ్యూనిస్ట్ నేత బర్ధన్ ఆశయసాధనకు కృషిచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సిపిఐ అగ్రనేత ఎబి బర్ధన్ 10వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం భీమవరం సిపిఐ జిల్లా కార్యాలయంలో బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ దేశంలో మతతత్వ శక్తులు అధికారంలోకి రానివ్వకుండా లౌకిక శక్తులను ఏకం చేసి యుపిఎ 1 ప్రభుత్వం అధికారంలోకి తేవడంలో బర్ధన్ కీలక పాత్ర నిర్వహించారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు వైవి.ఆనంద్, మల్లుల శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి నాయకుడు ఛాన్ భాషా తదితరులు బర్ధన్‌కు నివాళులర్పించారు.

బిసి రక్షణ చట్టం ఏర్పాటుకు హర్షం

ప్రజాశక్తి - పెనుగొండ

బిసి రక్షణ చట్టం ఏర్పరచిన కూటమి ప్రభుత్వానికి బిసి చైతన్య వేదిక కృతజ్ఞతలు తెలిపింది. శుక్రవారం ఆచంట నియోజకవర్గం అధ్యక్షుడు వేంద్ర రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ రెండు సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగా కూటమి ప్రభుత్వం బిసిల రక్షణ చట్టం ముసాయిదా ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి ధన్యావాదాలు తెలియజేస్తూ బిసిలు టిడిపికి వెన్నుముకగా నిలిచినందుకు కూటమి ప్రభుత్వం బిసిలకు న్యాయం చేసిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిసి చైతన్య వేదిక జాతీయ కార్యదర్శి అరటికట్ల త్యాగరాజ చారి, మార్న సూర్య ప్రసాద్, ధర్మావరపు సత్యనారాయణ, కడలి వెంకటేశ్వరరావు, కేత వీరస్వామి, తాతోలు వీరవెంకటచారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

9న మామిడి, కొబ్బరి ఫలసాయానికి వేలంపాట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులో ఉన్న పెన్మెత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న మామిడి, కొబ్బరి ఫలసాయం అనుభవించేందుకు వేలంపాట నిర్వహించనున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి 2027వ సంవత్సరం జనవరి 31 వరకు ఫల సాయాన్ని తీసుకునేందుకు ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాలకు బహిరంగంగా వేలంపాట నిర్వహించనున్నామని సర్కార్ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ వేలంపాటలో పాల్గొనవచ్చునని ఆయన తెలియజేశారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వారి కోర్టులో

FDI.A.No.7/2025in O.S.No.344/2011

Between:-

1. శ్రీమతి అన్నమరెడ్డి నాగమణి
2. శ్రీ అన్నమరెడ్డి దుర్గాప్రసాద్ ...పిటిషనర్స్/వాదులు

మరియు

1. శ్రీ అన్నమరెడ్డి గాంధీ(డైడ్)
2. శ్రీ అన్నమరెడ్డి బాపిరాజు(డైడ్)
3. శ్రీ అన్నమరెడ్డి వేణుగోపాలరావు వగైరా

...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

To.

5వ 7వ మరియు 10వ రెస్పాండెంట్లు/ప్రతివాదులు

5. శ్రీమతి అన్నమరెడ్డి @ పర్వతనేని లీల, D/o. లేట్ బాపిరాజు, వయస్సు 36 సంవత్సరాలు, గృహిణి, D.No. 26-105, జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా...

7. శ్రీమతి అన్నమరెడ్డి @ వడ్లమూడి సరిత, D/o. లేట్ బాపిరాజు, వయస్సు 34 సంవత్సరాలు, గృహిణి, D.No. 26-105, జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా..

10. కుమారి ఉప్పలపాటి శ్రీజ, D/o. లేట్ దుర్గాప్రసాద్, వయస్సు 20 సంవత్సరాలు, స్టూడెంట్, C/o. శ్రీ అన్నమరెడ్డి మురళి మోహన్, C.M.R. షాపింగ్ మాల్ ప్రక్కన, బాలాజీ Enclave అపార్ట్ మెంట్, కాలేజీ రోడ్, జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.,

పై నెంబరు పిటిషనులో పిటిషను సంగతులు తెలియజేయు నిమిత్తం 5వ, 7వ మరియు 10వ రెస్పాండెంట్లుకు శ్రీ కోర్టు వారి ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను ఎన్ని పర్యాయాలు నోటీసులు పంపినప్పటికీ సదరు 5వ, 7వ మరియు 10వ రెస్పాండెంట్లు బుద్ధి పూర్వకముగా avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా FDI.A. No. 7/2025 in O.S. No.344/2011 లో పిటిషన్ సంగతులు తెలియజేయడమైనది. మీకు ఏవైనా అభ్యంతరములు వున్నయెడల **ది.19-01-2026వ** తేదిన ఉదయం **10-30ని॥లకు** శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలియ పర్చుకోవచ్చును. లేనియెడల వారి పరోక్షమున తీర్మానించడమగునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

వాయిదా:- 19-01-2026

అత్మూరి సత్యనారాయణ
పిటిషనర్లు తరపు అడ్వకేట్
కొవ్వూరు

కొవ్వూరు
ది.22-12-2025
సెల్.9849847197